
సాక్షి గుంటూరు

ఆదివారం । 15 । అక్టోబర్ । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 3800 క్యూసెక్కులు విడుదల చేశారు.



మల్లాది వేంకటేశ్వరునికి పూజలు

అమరావతి: మల్లాది క్షేత్రంలోని శ్రీ వటవృక్షాంతర్గత వేంకటేశ్వరస్వామి వారికి శనివారం ప్రత్యేకపూజలు, ఘనంగా శాంతి కళ్యాణం నిర్వహించారు.



జగత్ప్రసూతికగా శ్రీశారదాంబ

నరసరావుపేటఈస్ట్: శ్రీ శృంగేరి శంకర మఠంలోని శ్రీ శారదాంబ అమ్మవారి ఆలయంలో అమ్మవారు శనివారం జగత్ప్రసూతిక అలంకారంలో దర్శనమిచ్చారు.

అబ్దుల్ కలాంను మార్గదర్శకంగా తీసుకోవాలి

- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె రోజా
- గుంటూరులో శిల్పారామం ప్రారంభం
- డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పురస్కారాలు అందజేత



పద్మశ్రీ అవార్డు గ్రహీత షేక్ మహబూబ్ సుభానీని సన్మానిస్తున్న మంత్రి రోజా



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రోజా, మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే ముస్తఫా, కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, మచిలీపట్నం పోర్టు డవలప్‌మెంట్ ఎండీ ఎం.దయాసాగర్



డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పురస్కార గ్రహీతలు షేక్ కాలేషాబి, డీకే చదువుల బాబు, షేక్ సుభానీ

గుంటూరురూరల్: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంను యువత ఆదర్శంగా తీసుకుని ఉజ్వల భవిష్యత్తు దిశగా కృషి చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక విభాగం శాఖ మంత్రి ఆర్‌కే రోజా పేర్కొన్నారు. శనివారం నగర శివారు ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్–2లో నూతనంగా నిర్మించిన శిల్పారామంను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ప్రత్యేక కార్యక్రమాల ద్వారా శిల్పారామంను ప్రారంభించటం జరిగిందన్నారు. డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి వేడుకలను పురస్కరించుకుని ముందస్తుగా ఆయన పేరుతో పురస్కారాలను అందించాలని నిర్ణయించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో శిల్పారామాల ఏర్పాటు కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే 8 జిల్లాల్లో శిల్పారామాలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. గుంటూరులో రూ.4.56 కోట్లతో శిల్పారామంను నిర్మించామన్నారు. రానున్న కాలంలో ప్రతి జిల్లాలో నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ప్రతి ఒక్కరూ కుటుంబంతో హాయిగా వచ్చి ఆడుతూ పాడుతూ సమయాన్ని గడపవచ్చన్నారు. బోట్ షికారును ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రాంగణంలో హస్తకళల స్టాల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. చేతి వృత్తులు, డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలు తయారు చేసిన వస్తువులను అందుబాటులో ఉంచామన్నారు. ఈ వేదికలపై సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజల ఆహ్లాదంకోసం ఏర్పాటు చేశామన్నారు. ప్రముఖ నాదస్వర విద్వాంసుడు పద్మశ్రీ అవార్డు గ్రహీతలు షేక్ మహబూబ్‌సుభాని, షేక్ కాలేషాబిలకు డాక్టర్ ఏపీజె అబ్దుల్ కలాం పురస్కారాలను అందించి సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. ప్రముఖ రచయిత, కేంద్ర సాహితీ పురస్కార గ్రహీత డీకే చదువుల బాబుకు పురస్కారం అందించి సన్మానించారు. ఈయన రచించిన రచనలు పాఠ్యపుస్తకాల్లో కూడా ప్రచురించారని తెలిపారు. ప్రముఖ గాయకుడు, గేయరచయిత, నటుడు, జాతీయ జెండా ప్రచారకర్త షేక్ మాబుసుభానికి పురస్కారాన్ని అందించి సన్మానించారు. ఈయన పింగళి వెంకయ్య కుటుంబానికి అత్యంత సన్నిహితుడని కొనియాడారు. పురస్కార గ్రహీతలు మాట్లాడుతూ ఈ విధంగా సన్మానించిన రాష్ట్ర ప్రభుత్వానికి శిల్పారామం అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ గుంటూరులో ఆహ్లాదకర వాతావరణంలో ఈ శిల్పారామంను ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు మహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, సాంస్కృతిక విభాగం ఛైర్మన్ వంగపండు ఉష, మచిలీపట్నం పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్, విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ ఛైర్మన్ ముంతాజ్, డిప్యూటీ మేయర్ షేక్ సజిల, స్థానిక కార్పొరేటర్ బి స్మితపద్మజ, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, నగర కమిషనర్ కీర్తి చేకూరి, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ ఎం.శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ బత్తుల దేవానంద్, ఆర్‌అండ్ బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, మిర్చి యార్డు డైరెక్టర్ బి వెంకటేశ్వరరావు(ఇంద్ర) పర్యాటక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.2,500, గరిష్ఠ ధర రూ.4,000, మోడల్ ధర రూ.3,300 వరకు పలికింది.

ప్రశాంతంగా ఎస్ఐ మెయిన్స్ రాత పరీక్షలు

కేంద్రాలను పరిశీలించిన ఐజీ పాలరాజు, ఎస్పీలు



ఓ పరీక్ష కేంద్రం వద్ద బారులు తీరిన అభ్యర్థులు

నగరంపాలెం(గుంటూరువెస్ట్): గుంటూరు రేంజ్ పరిధిలో రెండు రోజులపాటు నిర్వహించే ఎస్ఐ మెయిన్స్ రాత పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గుంటూరు జిల్లా పరిధిలో 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా, 7,145 మంది అభ్యర్థులకు హాల్ టికెట్లను జారీ చేసిన విషయం విదితమే. గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు ఉదయాన్నే టీజేపీఎస్ కళాశాల, ఏసీ కళాశాల, ఆర్‌వీఆర్/జేసీ కళాశాల, విజ్ఞాన్ నీరులా/డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఎస్పీలు కె.ఆరిఫ్‌హఫీజ్ (గుంటూరు), వకుల్ జిందాల్ (బాపట్ల), వై.రవిశంకర్ రెడ్డి (పల్నాడు), ఎస్ఐ అభ్యర్థుల ఎంపిక నోడల్ అధికారిణి, గుంటూరు ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ పలు కేంద్రాలను పరిశీలించారు. ఆయా పరీక్ష కేంద్రాలలో ఎంత మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారు, లోపలికి వచ్చే వేళల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలీస్ బందోబస్తు ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు ఐజీ పలు సూచనలు చేశారు. అభ్యర్థులకు కల్పించిన మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. బయోమెట్రిక్, ఫొటోగ్రాఫ్‌లను కూలంకుషంగా పరిశీలించారు. గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఎస్ఐ అభ్యర్థుల మెయిన్స్ రాత పరీక్షలు ప్రారంభమైనట్లు చెప్పారు. జిల్లాలో 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి ఒక్కరిని బయోమెట్రిక్‌తో కూలంకుషంగా పరిశీలించి, తదుపరి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించినట్లు తెలిపారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ముందస్తు జాగ్రత్తలు, పహారా నిర్వహించడంతో తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఏఎస్పీలు నాచికేత్ షెల్కే (గుంటూరు తూర్పు), మహేష్ (బాపట్ల), ఎ.శ్రీనివాసరావు (క్రైం), డీఎస్పీలు ఉమామహేశ్వరరెడ్డి, బాలసుందరరావు, రేంజ్‌లోని పలువురు ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, బీడీ బృందాలు బందోబస్తు నిర్వహించారు.

సుస్థిర నగరాల జాబితాలో గుంటూరు



నెహ్రూనగర్: సుస్థిర నగరాల జాబితాలో గుంటూరు, విజయవాడ నగరపాలక సంస్థలు చోటు దక్కించుకున్నాయి. యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(యూనిడో), స్వచ్ఛ భారత్ మిషన్, అర్బన్ మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ సంయుక్తంగా ఢిల్లీలో రెండు రోజులపాటు ఇండియా ఫోరం సమావేశం నిర్వహించింది. ఇందులో భాగంగా వ్యర్థాల నిర్వహణ, వనరుల పునరుద్ధరణ, సామర్థ్యాన్ని పెంపొందించడం, ప్రజల అవసరాలకు అనుగుణంగా వసతుల కల్పన వంటి కార్యక్రమాలు మరింతగా అమలు చేసే ప్రక్రియలో భాగంగా గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ఫెసిలిటీ నిధులతో ప్రాజెక్ట్ అమలు చేస్తుంది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా సుస్థిర నగరాలుగా దేశంలోని భోపాల్, గుంటూరు, జైపూర్, మైసూర్, విజయవాడ నగరాలను ఎంపిక చేశారు.

కౌండిన్య అకాడమీ ఏర్పాటు అభినందనీయం

ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు



కౌండిన్య ఐఏఎస్ అకాడమీలో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, వ్యవస్థాపకుడు ఇవీ నారాయణ, సభ్యులు

పెదకాకాని: పేద విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ధ్యేయంగా కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ఏర్పాటు అభినందనీయమని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. మండలంలోని వెనిగండ్ల గ్రామ శివారు జొన్నలగడ్డ రోడ్డులో నిర్మించిన కౌండిన్య ఐఏఎస్ అకాడమీలో ఇవ్వబోయే కోర్సులపై శనివారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న వారిని పోటీ పరీక్షలకు తీర్చిదిద్దాలని, సమాజంలో ప్రయోజకుల్ని చేయాలనే ఆశయంతో ట్రస్ట్ ఏర్పాటు చేయడం చాలా గొప్ప కార్యక్రమమన్నారు. ప్రభుత్వం చదువుకునే వారికి స్కాలర్‌షిప్‌లు ఇచ్చి ప్రోత్సహిస్తున్నట్లుగా చదువులు పూర్తి చేసిన వారికి దిశ నిర్దేశం చేస్తూ స్థాపించిన కౌండిన్య ఐఏఎస్ అకాడమీని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోర్సుల జైనింగ్, క్లాసుల నిర్వహణలో తనవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రభుత్వం ఉద్యోగాలకు ఎటువంటి నోటిఫికేషన్ ఇచ్చినా కోచింగ్ ఇచ్చేందుకు సంసిద్ధులైన ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, టీజేపీఎస్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ ఇ.వి.నారాయణ, ట్రస్టు సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ముందుగా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ట్రస్టు వ్యవస్థాపక, అధ్యక్షుడు డాక్టర్ ఇ.వి.నారాయణ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు అధిక సంఖ్యలో ఖర్చు అవుతున్న నేపథ్యంలో నామమాత్రపు ఫీజుతో చదువు పూర్తయిన వారిని తీర్చిదిద్దడమే అకాడమీ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలోఅకాడమీ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

డాక్టర్ ఫణిభూషణ్‌కే సారథ్యం

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్ మానసిక వ్యాధి వైద్య నిపుణుల పూర్వ విద్యార్థుల సంఘం కలయిక శనివారం గుంటూరు వైద్య కళాశాలలో జరిగింది. పలు రాష్ట్రాలకు చెందిన పూర్వ వైద్య విద్యార్థులు ఈ పూర్వ కలయికలో పాల్గొని నాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. గుంటూరు జీజీహెచ్ మానసిక వ్యాధుల వైద్య విభాగంలో సమావేశమై వైద్య విభాగాన్ని బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. అనంతరం పూర్వ వైద్య విద్యార్థుల సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మానసిక వైద్యుల పూర్వ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన డాక్టర్ ద్రోణంరాజు ఫణిభూషణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ విశ్వేశ్వరరావు, సెక్రటరీగా డాక్టర్ జార్జిరెడ్డి, కోశాధికారిగా డాక్టర్ సాయిరామ్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జీజీహెచ్ మానసిక వైద్య విభాగాధిపతి డాక్టర్ నీలి ఉమాజ్యోతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ నిమిషా పాల్గొన్నారు.

దసరా ప్రత్యేక రైళ్ల కేటాయింపు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం దసరా పండుగను పురస్కరించుకుని ప్రత్యేక రైళ్లను రైల్వే శాఖ కేటాయించడం జరిగిందని గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ శనివారం వెల్లడించారు. 07653 కాచిగూడ-కాకినాడ టౌన్ రైలు ఈనెల 19, 26వ తేదీలలో కాచిగూడ స్టేషన్ నుంచి రాత్రి 8.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు కాకినాడటౌన్ స్టేషన్‌కు చేరుకుంటుంది. 07654 కాకినాడ టౌన్- కాచిగూడ మధ్య 20,27వ తేదీలలో కాకినాడ టౌన్ స్టేషన్ నుంచి సాయంత్రం 5.10 గంటలకు బయలు దేరి కాచిగూడ స్టేషన్‌కు మరుసటి రోజు సాయంత్రం 4.50 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. 07453 నర్సాపూర్-వికారాబాద్ రైలు ఈ నెల 15న నర్సాపూర్‌లో సాయంత్రం 6 గంటలకు బయలు దేరి వికారాబాద్ స్టేషన్‌కు ఉదయం 5.10 గంటలకు చేరుకుంటుందని తెలిపారు.

ముగ్గురు సీఐల బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలోని గుంటూరు నగరంలో ముగ్గురు సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ జి. పాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో లాలాపేట సీఐగా పనిచేస్తున్న ఎం. సుబ్బారావును రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు. అక్కడకు తూర్పు ట్రాఫిక్ పీఎస్‌లో పనిచేస్తున్న మాతంగి శ్రీనివాసరావును నియమించారు. అలాగే వీఆర్‌లో ఉన్న బి.కోటేశ్వరరావును తూర్పు ట్రాఫిక్ పీఎస్‌కు కేటాయించారు.

నేడు డీఆర్ఎం- 09, పల్నాడు పోలీస్ జట్ల మధ్య క్రికెట్ ఫైనల్స్

వివరాలు వెల్లడించిన డీఆర్ఎం ఎం.రామకృష్ణ

లక్ష్మీపురం: కొద్ది రోజులుగా గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో నిర్వహించనున్న డీఆర్ఎం క్రీడా పోటీలలో క్రికెట్ ఫైనల్స్‌కు గుంటూరు రైల్వే డీఆర్ఎం-09 జట్టు, పల్నాడు పోలీస్ జట్ల మధ్య ఆదివారం ఫైనల్స్ జరగనుందని డివిజన్ డీఆర్ఎం ఎం.రామకృష్ణ అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సౌత్ సెంట్రల్ రైల్వే శాఖలో కనివినీ ఎరగనీ రీతిలో గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల మధ్య స్నేహ సంబంధం మరింత బలోపేతం అయ్యేందుకు డీఆర్ఎం కప్ క్రీడా పోటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గుంటూరు నల్లపాడు పేరెడ్ గ్రౌండ్స్‌లో క్రికెట్ ఫైనల్స్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా గుంటూరు జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డిలు విచ్చేయనున్నారని తెలిపారు. అదే విధంగా షటిల్ బ్యాట్మింటన్ పోటీలలో 32 జట్లు పాల్గొనగా వారి లో మొదటి నాలుగు స్థానాలలో మొదటి స్థానం విజయసాయిరెడ్డి, జి.జితేంద్ర, ద్వితీయ స్థానం సిద్ధార్థ గౌతమ్, జయంత్, తృతీయ స్థానం అబ్బాస్, సాయి, నాల్గో స్థానంలో జి.రాజ్‌పాల్, షేక్ రియాజ్ నిలిచారన్నారు. వాలీబాల్ పోటీలలో 16 జట్లు పోటీ పడగా మొదటి స్థానం యూనిక్ స్పోర్ట్స్ వరల్డ్, ద్వితీయ స్థానం గుంటూరు రైల్వే , తృతీయ స్థానం గుంటూరు పోలీస్, నాల్గో స్థానంను తెనాలి జట్లు గెలుపు కై వసం చేసుకున్నారన్నారు.

బెంగాల్ జట్టుపై ఢిల్లీ విజయం

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శనివారం జరిగిన వినూ మన్కడ్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లో బెంగాల్ జట్టుపై ఢిల్లీ జట్టు 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బెంగాల్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 244 పరుగులు సాధించింది. జట్టు బ్యాట్స్‌మెన్ అంకూష్ సర్ 6 సిక్సులు, 6 ఫోర్లతో 29 బంతులలో 73 పరుగులతో నాటౌట్‌గా నిలవగా ఢిల్లీ జట్టు బౌలర్ యువగుప్తా 8 ఓవర్లలో 43 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీశాడు. అనంతరం 245 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ జట్టు 48 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 246 పరుగులతో విజయం సాధించింది.

